# బొమ్మలు చెప్పిన కథ




రాత్రి సంధ్యకు వీడ్కోలు ఇచ్చి అప్పటికి సరిగ్గా నాలుగ్గంటలవుతోంది. చీకటి పూర్తిగా చిక్కబడింది. నగరం చీకటి చాటున నిద్రకు సమాయత్తమవుతోంది.

చుక్కల రేడు చీకటిని పారద్రోలడంలో పూర్తిగా విఫలమయ్యానని సిగ్గుపడ్తూ, కదులుతున్న మబ్బుల వెనుక తన ముఖాన్ని చాటుచేసుకుంటున్నాడు. – అయితే పార్కులో ఒక విగ్రహానికానుకొని కూర్చుని వున్న బాలుడు ఇవేమీ గమనించే స్థితిలో లేడు. – అతడప్పటివరకూ ఏడ్చాడనడానికి గుర్తుగా చక్రాల్లాంటి కళ్ళు వుబ్బి ఎరుపెక్కి వున్నాయి. గుండ్రటిపాలబుగ్గల మీద కన్నీరు ఎండి చారికలు కట్టి వుంది. మెల్లగా నిద్రాదేవత వాడిని తన ఒడిలోనికి లాక్కుంటోంది.

వాడి పేరు చందు. ఆ రోజు ఆగస్ట్ పదిహేను కనుక, తన సహ విద్యార్థులతో మామూలుగానే స్కూల్ ఫంక్షన్‌కి వెళ్ళాడు చందు. లంచ్ తర్వాత వాళ్ళతో కలిసి మ్యాట్నీ కెళ్ళాడు. అక్కడివరకూ బానే వుంది. తర్వాతే వచ్చింది చిక్కంతా. మ్యాట్నీ సినిమా అవగానే అందరూ కలిసి పార్కుకి వెళ్ళి సాయంత్రం వరకు కేరింతలు కొడ్తూ అక్కడే ఆడుకున్నారు. చందూ కూడా వాళ్ళతో కలిసి చాలాసేపు ఆడాడు. అయితే ఎప్పుడు పట్టిందో తెలియదు నిద్ర. లేచేటప్పటికి చుట్టూ చీకటి. తన చుట్టుపక్కల ఎవరూ లేరు. ఆ ప్రదేశం అంతటా భయంకర నిశ్శబ్దం అలుముకొని వుంది. ఆ నిశ్శబ్దంలోంచి చల్లటి చిరుగాలి తన వునికిని స్పష్టంగా తెలియజేస్తోంది. గుండెల్లో నుండి బయలుదేరిన భయం వళ్ళంతా పాకగా, వాడు ఒక్కసారిగా బావురుమన్నాడు.

భయపడక పోవడానికి వాడేమీ పెద్ద ఆరిందా కాదు. పదకొండేళ్ళ పసివాడు. ఓదార్చడానికి కూడా ఎవరూ లేరక్కడ. భయమే అభయమిచ్చి, జోకొట్టి మెల్లగా నిద్రాదేవత ఒడిలోనికి జేర్చింది వాణ్ణి.

"బాబూ!" – ఎవరో తట్టి లేపినట్టు వులిక్కిపడి లేచాడు చందు. భయంగా చీకట్లోకి చుట్టూ పరికించి చూశాడు. ఎవరూ లేరు. కళ్ళు మూసుకోబోతుండగా మరోసారి వినిపించింది అదే గొంతు. ఆ మాటలు తను ఆనుకొని వున్న విగ్రహంలోంచి వస్తున్నట్టుగా గమనించాడు చందు. అప్పటికి వాడికి కొద్దిగా భయం తగ్గి చిత్రంగా అనిపించసాగింది.

"బాబూ నీ పేరేంటి?" అడిగింది విగ్రహం. "నా పేరు చందు. కాని మీరెవరు ఇలా విగ్రహంలోంచి మాట్లాడుతున్నారు?"

"నా పేరు గాంధి... పేరు ఏదైతేనేం అంతా నా తలరాత" అంది విగ్రహం.

" అవును నాకు తెలుసు – మీరిపుడు ఎక్స్ ప్రైమ్ మినిష్టర్."

"కాదు బాబూ నేనేనాడూ ఏ విధమైన మంత్రి పదవులూ ఆశించలేదు!"

ఒక క్షణం విగ్రహం మొహాన్ని పరికించి చూశాడు చందు. "అయితే మీరు రాజీవ్ గాంధి కాదా?"

"కాదు బాబూ నా పేరు మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధి. నన్నందరూ జాతిపిత అని పిలిచేవారు. అప్పట్లో మనకు స్వాతంత్ర్యం సిద్ధించడానికి కృషి చేసిన ప్రముఖులలో నేను ముఖ్యుడను. గత వైభవాన్ని స్వయంగా చెప్తుకుంటుంటే గొంతులో బాధతో కూడిన జీర ధ్వనించింది. బాబూ సూటిగా నా ముఖంలోకి చూసి చెప్తు – ఇంతకు ముందెక్కడా నా ఫోటో చూళ్ళేదా?"

చందు నడక వెన్నెల్లో విగ్రహాన్ని పరిశీలనగా చూసి – "అవును గుర్తుకు వస్తోంది, మా డాడీతో వాళ్ళ ఆఫీసుకు వెళ్ళినపుడు అక్కడ చూశాను మీ ఫోటో. మీ గురించి ఏమైనా చెప్పండి" అడిగాడు చందు.

" ఏం చెప్పమంటావు బాబూ, ఇరవయ్ సంవత్సరాల క్రితం నన్నిక్కడ శిలావిగ్రహం చేశారు. అప్పటి నుండి నన్ను పట్టించుకున్న నాథుడే లేడు. రోజూ ఈ పార్కులోకి వచ్చిన కుక్కలు మరికొన్ని జంతువులు నా కాళ్ళ మీదే లఘుశంక తీర్చుకుంటున్నాయి. ఇంక పక్షులైతే నా తలని పబ్లిక్ లావెట్రీగా వుపయోగించుకుంటున్నాయి. ఈ ఇరవయ్ సంవత్సరాల నుండి నన్ను ప్రతిష్ఠించిన వాళ్ళు ఒక్క సారన్నా వస్తారనీ వచ్చి నా బాగోగులు చూస్తారనీ, ప్రతి సంవత్సరం ఆశగా ఎదురుచూసేవాణ్ణి. కానీ ఎవరూ రాలేదు. ఇన్నాళ్ళూ ఎండకు ఎండాను, వానలో తడిశాను – ఇంక ఈ దుర్భరమైన జీవితం గడపలేను బాబూ! గ..డ..ప..లే..ను....." అంటూ ఆ విగ్రహం కాసేపటికి మూగవోయింది. మరిక తరువాత ఏ శబ్దమూ లేకుండా మిన్నకుండిపోయింది.

చందూ మనసులో అప్పటివరకు వున్న కొద్దో గొప్పో భయం రెక్కలు కట్టుకుంటూ ఎగిరిపోయింది, మరొక పిరికివాణ్ణి ఆవహించడానికి.

ఆ నిర్మానుష్య ప్రాంతంలో తనకు తోడుగా ఎవరో వున్నారన్న భావన!!

పాడవాటి గెడ్డం, ధనస్సు చేతబట్టి, భుజం వెనుక అమ్ముల పొదితో, ఆ పక్కనే వున్న మరొక విగ్రహం వద్దకు వెళ్ళాడు చందు. – దాని కోసమే వేచి చూస్తున్నట్టు విగ్రహావు గొంతులోంచి బారెడు నిట్టూర్పు వెలువడింది----" నా పేరు అల్లూరి సీతారామరాజు బాబూ!"– అప్పటి వరకు విగ్రహాన్ని ఆపాదమస్తకము పరిశీలించిన చందు "అవును నాకు తెలుసు! సినిమాలో చూశాను దాన్లో మీరొక పాట కూడా పాడారు" అన్నాడు.

విగ్రహం మరో వేడి నిట్టూర్పు విడుస్తూ – "లేదు బాబూ నేనే పాటలూ, పద్యాలూ పాడలేదు. అప్పట్లో నాకసలు కాలమే మిగిలేది కాదు. – ఆంగ్లేయుల గుండెల్లో, ధూమ శకటాలు పరువెత్తించిన మన్యం వీరుడని అప్పట్లో నన్నందరూ కొనియాడే వారు – ఆ నా పేరు వింటేనే ఆంగ్లేయులంతా గజ గజా వణికే వారు. – ప్చ్... కాల ప్రభావం నేనిప్పడు చలిలో వణుకుతున్నా ఎవరూ పట్టించు కోడం లేదు – నా జీవితమంతా చల్లటి వాయువులు పీలుస్తూ అడవుల్లోనే సంచరించాను. – నన్నిప్పడు నగరం నడిబొడ్డులోని ఈ పార్కులో కట్టి పడవేశారు. – పూర్తిగా కాలుష్యమైన ఈ వాతావరణంలో నేను ఇముడలేకపోతున్నాను బాబూ!"–

"నువ్వు గమనించావో? లేదో? – నా కుడి కాలు పూర్తిగ శిథిలమైపోయింది. – ఒంటి కాలి మీద నేనిలా ఎనిమిది సంవత్సరాలుగా జీవిస్తున్నాను... నన్ను పట్టించుకున్న నాధుడే లేడు!" అంటూండగా పోలీస్ పెట్రోలింగ్ వాన్ సైరన్ మ్రోగిస్తూ, అటు వైపుగ వచ్చింది. – అంతే ఆ విగ్రహం మూగవోయింది –మరిక అది మాట్లాడదని గమనించిన చందు, ఆ ప్రక్కనే వున్న మరొక విగ్రహం వద్దకు వెళ్ళాడు.

శ్వేత శ్వాసనధిరోహించి, ఒక చేత కళ్ళెము మరొక చేత కరవాలమ్ము బూని, క్రౌర్యం వెనుక సౌందర్యాన్ని దాచుకున్న మూర్తి, మాతృత్వపు మాధుర్యాన్ని గొంతులో పలికించి, ఆర్తితో – "బాబూ విన్నావు కదా!! వారు చెప్పింది – నా సమస్యలు కూడా అవే అని దీనంగా పలికింది."

అతడికి వెంటనే తన తల్లి జ్ఞప్తికి వచ్చింది. అతడు మాతృత్వ మాధుర్యపు వెల్లువలో కొట్టుకు పోతూ, – ఆమె మెడ చుట్టూ చేతులు వేసి, ముఖాన్ని మెడ వంపులో దాచుకుంటూ–"అమ్మా నీకు నేను తోడుగా వుంటాను"అని చెప్పాలనిపించింది. – చందు మూగవోయిన తన గొంతును పలికించేంతలో, – ఆ మూర్తి అతడి మౌనాన్ని మరోలా అర్థం చేసుకొని– "బాబూ నేనెవర్నా! అని ఆశ్చర్య పోతున్నావు కదూ! జనులందరి చేత వీర నారి అని ముక్తకంఠంతో కొనియాడబడిన ఝాన్సీ లక్ష్మీబాయిని – అలాంటి వీరనారికి ఇప్పుడు పిరికితనం ఆవహించింది. – చెప్పకోడానికి కూడా సిగ్గుపడే విషయం – అయినా పుత్ర సమానుడవైన నీ ముందు సిగ్గు పడటం అవివేకం.

కొన్ని రోజుల క్రితం ఒక వ్యక్తి తనతో ఒక దిన పత్రికను తెచ్చి, నన్నానుకొని కూర్చొని, కొంత సేపు చదివి, తరువాత దాన్నక్కడే పడవేసి వెళ్ళిపోయాడు. కొంతసేపటికి కుతూహలంగా ఆ పత్రిక మొదటి పేజీ చూద్దును గదా! 'మహిళపై పోలీస్ కానిస్టేబుల్ దౌర్జన్యం, పోలీస్ స్టేషన్‌లో స్త్రీ మాన భంగం' అన్నీ ఇటువంటి వార్తలే, గాలికి రెండవ పేజీ తిరగబడింది. దాన్లోనూ అంతే. – అప్పటి నుండిఅర్ధరాత్రి బీట్ కానిస్టేబుల్ ఈ వైపు వచ్చినప్పుడల్లా, నేనెక్కడ అతడి కంట పడ్తానోనని తీవ్ర ఆందోళనకు గురౌతున్నాను!"– అంటూ ఇంకేదో చెప్పబోతూ చందూ కనురెప్పలు బరువుగా మూసుకోడం గమనించి మౌనం దాల్చింది.

మర్నాడు ప్రొద్దుటే నాన్నగారు లేపుతుంటే మెలకువ వచ్చింది చందూకి. – ఇంటికి వెళ్ళగానే అమ్మ, అక్కయ్య అందరూ ముద్దుల వర్షం కురిపించారు. – నాన్నగారు బైట ఎవరితోనో చెప్తున్నారు.–" నేను వెళ్ళేటప్పటికి పార్కులో పడుకుని నిద్రపోతున్నాడు. రాత్రంతా ఎంత గాభరా పడ్డామో తెలుసా!"


చందూ చిత్రమైన అనుభూతికి లోనవుతున్నాడు – ఆ రోజు తను లేవగనే స్నానం చెయ్, స్కూలుకి టైమవుతుందనో.... – హోమ్ వర్క్ చేస్కోమనో చెప్పేవారు. కానీ ఈ రోజు... అందుకే రాత్రి జరిగిన విషయాలన్నీ ఒకటొకటిగా చెప్పడం మొదలుపెట్టాడు. – అంతా విన్న తరువాత అమ్మ చందూని కౌగలించుకొని ఏడవడం మొదలు పెట్టింది. – నాన్నగారు అయోమయంగా చూస్తున్నారు. – చందూని చూడటానికి వచ్చిన ఇరుగు పొరుగు వారు "నిన్న ఆగస్ట్ పదిహేను కదా! స్కూల్లో ఆ విషయాలేవో చెప్పి వుంటారు. – పై పెచ్చు రాత్రంతా ఒక్కడే వున్నాడు కదా! – భయపడి వుంటాడు మరేం పర్వాలేదు" అన్నారు. ●

"నేను నిర్మాతగా వున్నప్పుడు తెల్లవారగానే ఓ తార ఫోన్‌లో ఓ తియ్యని ముద్దిచ్చి నిద్రలేపేది"

"మరిప్పుడు?"

"అప్పులవాళ్ళు నిద్రలేపుతున్నారు"

–పద్మశ్రీ, మాణిక్యారం




# హిప్నాటిజం ద్వారా వ్యాధులకు చికిత్స

శారీరక, మానసిక ఒత్తిడులు, చికాకు, కోపం, భయాందోళనలు, న్యూనతాభావం (INFERIORITY COMPLEX), జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం లోపించడం, త్రాగుడు, సిగరెట్లు మొదలగు దురలవాట్లు, నత్తి, బి.పి. (రక్తపు పోటు), నిద్ర పట్టకపోవడం, ఎలర్జీ వల్ల వచ్చే ఉబ్బసం, కొన్ని రకాల పిచ్చి, దృష్టి లోపం (SHORT . SIGHT), గుండెజబ్బు మరియు మధుమేహం (DIABATIS) ఇలాంటి ఎన్నో బాధలు, సమస్యలకు హిప్నాటిజం మరియు హోమియోపతి వైద్య విధానాల ద్వారా చికిత్స చేయబడును.

# మీ స్వయంగా హిప్నాటిజం నేర్చుకోండి

ప్రాక్టికల్/ పోస్టల్/ కేసెట్ మొదలగు వివిధ పద్ధతుల ద్వారా సెల్ఫ్ హిప్నాసిస్, ఇతరులను హిప్నటైజ్ చేయడం, హిప్నాసిస్ ద్వారా మీ సమస్యల పరిష్కారం మొదలగునవి నేర్పబడతాయి. ప్రాక్టికల్ కోర్సు ఫీజు రు. 170లు. ప్రత్యేక గమనిక: హిప్నాటిజం వినోద, వైజ్ఞానిక ప్రదర్శనలు కావలసినవారు సంప్రదించండి.

చికిత్స, ప్రాక్టికల్/పోస్టల్/ కేసెట్ (ప్రదర్శనలు) మొదలగు పూర్తి వివరాలకు రు. 5లు ఎం.ఒ. చేసి ప్రాస్పెక్టస్ పొందండి.

## డాక్టర్ పి.ఎస్. రెడ్డి

బంజారసదన్, 14వ వీధి

హిమాయత్‌నగర్

హైదరాబాద్ - 500 029.